# “నీవు నన్ను ప్రేమించుచున్నావా?”

# (21:1-25)

దేశంలో ఉండే దాదాపుగా ప్రతి సెక్రటరీ బల్లమీద కన్పించే లిక్విడ్ పేపర్ బహు వింతగా తయారీ చేయబడిన వస్తువు. అది ఇంకులా తయారీ చేయబడిన వస్తువు. అది చిన్న బాటిల్స్‌లో వస్తుంది, తప్పులను దిద్దుకొనడానికి దానిని చిన్న బ్రష్‌తో రుద్దుకోవచ్చు. వ్రాతలో తప్పుగా ఉచ్చరింపబడిన పదం, లేక పేజీ మీద మరక కన్పిస్తే, లిక్విడ్ పేపరును రుద్దితే, ఆ సమస్య అదృశ్యమౌతుంది. లిక్విడ్ పేపర్ మన జీవితాలకు కూడా ఉంటే, ఆశ్చర్యంగా ఉండదా? చింతాజనకమైన సత్యమేమంటే, అది మనకు అవసరం! విఫలమైన లేక ఓడిపోయిన మన జీవితాలకు “ఆత్మ సంబంధమైన లిక్విడ్ పేపర్” మనకు కావలసి వచ్చినప్పుడు, నూతన ఆరంభాన్ని మనం అనుభవించగలుగు మార్గాన్ని యోహాను సువార్త చివరి అధ్యాయం వర్ణిస్తుంది.

### సంభవం జరిగిన ఒక దృశ్యం (21:1-14)

పునరుత్థానం తరువాత, ఆరోహణానికి ముందు, ప్రభువైన యేసు తన శిష్యులలో కొందరికి మరోసారి ప్రత్యక్షమయ్యాడు. గలిలయ సముద్రము చుట్టునున్న తమ గృహ ప్రాంతాలకు వారిలో ఏడుగురు చేరుకున్నారు. ప్రభువైన యేసు అప్పగింపబడిన ఆ రాత్రి ఆయనను ఎరుగనని బొంకినందుకు పేతురు యింకను బాధపడుతూ, “నేను చేపలు పట్టబోదునని” అన్నాడు (21:3). తక్కినవారు అతనితో కూడ వెళ్లారు. వారు ఆ రాత్రియంతా ప్రయాసపడినా ఒక్క చేపనైనా పట్టలేకపోయారు. ఉదయం తెల్లవారు చుండగా, నీడవంటి ఒక ఆకారం వారికి ప్రత్యక్షమై – “పిల్లలారా, భోజనమునకు మీయొద్ద ఏమైన ఉన్నదా?” అని అడిగాడు (21:5). ఆయన ప్రభువని వారు గుర్తుపట్టక, “లేదు”! అని పెద్దగా పలికారు (21:5). ఆ దోనెకు కుడివైపున వలవేస్తే చేపలు పడతాయని ఆ అసాధారణమైన మనిషి వారికి తెలిపాడు. ఎందుకో మొత్తానికి ఆ అసాధారణమైన మనిషి చెప్పినట్టు వారు చేశారు.

వారు వలను దరికి లాగ ప్రయత్నించినప్పుడు, వల చేపలతో నిండియున్నందున వల లాగలేకపోయారు. ఒడ్డున నిలిచిన ఆ వింత మనిషి ఎవరో యోహాను గుర్తించి “–ఆయన ప్రభువు సుమి” అని పేతురుతో చెప్పాడు (21:7). పేతురు, ఎప్పటివలె దుడుకుపడి, త్వరగా తన పైబట్ట వేసికొని సముద్రంలోనికి దూకాడు, దరికి ఈదుకుంటూ వచ్చాడు. తక్కిన శిష్యులు పట్టిన చేపలతో దరికి రాగానే అక్కడ నిప్పులును వాటిమీద

ఉంచబడిన చేపలును రొట్టెయు కనబడ్డాయి. తరువాత జరుగబోయేదాని దృష్టిలో, యిది ముఖ్యమై ఉండవచ్చు. యోహాను సువార్తలో నిప్పుల మంట మరి యింకొకసారి మాత్రమే కన్పిస్తుంది. అది పేతురు చలి కాచుకొంటూ ప్రభువును ఎరుగనని బొంకిన చోటు (18:18).

ప్రభువు వారిని భోజనం చేయడానికి ఆహ్వానించాడు, వారందరు భుజించారు. భోజనం గుర్తింపబడకుండగనే జరిగియుండవచ్చు, మరియు వారు భుజిస్తుండగా సుఖంలేని నిశబ్దాన్ని వారు పాటించియుండవచ్చు. ఒక మనిషి చనిపోవడం నీవు చూచిన తరువాత ఆ వ్యక్తి ప్రాణంతో బ్రతికి వచ్చాడంటే నీవేమంటావ్? దేవుని కుమారుడే ఉదయకాలపు భోజనాన్ని ఏర్పాటు చేసియుంటే అందులో మాట్లాడే విశేషం ఏమి ఉంటుంది?

## ఎదుర్కోలు (21:15)

శిష్యులు తమ భోజనాన్ని ముగిస్తుండగా, ప్రభువు పేతురువైపు తిరిగి, పేతురునకు ఎంతగానో భయపడినా, చాలా అవసరమైన ప్రశ్నను ప్రభువు యిలా అడిగాడు: "– యోహాను కుమారుడవైన సీమోనూ, వీరికంటె నీవు నన్ను ఎక్కువగా ప్రేమించు చున్నావా?" (21:15). ఆ చిన్న ప్రశ్నతో ప్రభువు పేతురు యొక్క పాపాన్ని బయటపెట్టాడు, మరియు పేతురు ఆత్మను చంపజూసిన తీవ్ర గాయాన్ని ఆయన తెరిచాడు. పేతురు పాపాన్ని నేరుగా ఎదుర్కొనక పోయినట్లయితే, మరియు మారుమనస్సు పొందకయు, క్షమింప బడకయు ఉన్నట్టయితే, ఆ గొప్ప అపొస్తలుడైన పేతురు తన జీవితంలోని మిగిలిన కాలం దుఃఖ సహితుడై, నలిగిపోయినవాడై – కేవలం గలిలయలోని జాలరులలో మరొకడుగా మాత్రమే మిగిలిపోయేవాడే. అట్టిది సంభవింపకుండునంత అధికంగా ప్రభువు అతనిని ప్రేమించాడు.

మనం మన పాపాన్ని దాచుకొని మనకు దోషం లేదని చెప్పుకొనడం బహు వింతగా ఉంటుంది. జనులు ఎల్లప్పుడు అలాగే చేస్తూ ఉంటారు. అయినా అది ఎవరికీ మేలు కలిగించదు. పాపాన్ని తప్పించుకొనడానికి బదులు, అది లేదన్నట్టు నటన చేయడంవలన పాపానికి మనం ఎక్కువ బలాన్ని చేకూర్చినవారమౌతాం.

వాల్ట్ డిస్నీ చిత్రంలో సింహపు రాజు ఉండేవాడు. అది ఒక దోషము అవమానముల శక్తి కలిగిన కథ. సింబా అనే పేరుగల యౌవన సింహపు కథ అది. వాని తండ్రి అడవి మృగాల తొక్కిసలాటలో చనిపోయాడు. సింబా దుష్టుడైన పినతండ్రి స్కార్ అనబడే పిరికిపంద, తరువాత రాజుగా ఉండగోరాడు. అయితే ఈ యువక సింహమైన సింబా లేకపోతేనే అతడు అలా చేయగలడు. స్కార్, రహస్యంగా ఉంచబడిన పాపపు శక్తిని ఎరిగినవాడు కాబట్టి, తన అన్న కొడుకే వాని తండ్రి మరణానికి కారకుడన్న విషయాన్ని గుప్తం చేసి, "నీవు చేసిన పని ఏమి? మీ తల్లి ఏమనుకుంటుంది?" అని అడిగాడు. అప్పుడు తానేమి చేయాలో సింబా అడుగుతాడు. అప్పుడు, "పారిపో!" అని స్కార్ అనడంతో, అతడు అలాగే చేస్తాడు.

తన దోషంనుండి కొన్ని సంవత్సరాలు పరుగెత్తిన తరువాత, సింబా తిరిగి వచ్చి తన గతాన్ని ఎదుర్కొనడానికి ధైర్యం తెచ్చుకున్నాడు. అక్కడకు వచ్చాడంటే, తన కుటుంబాన్ని కాపాడగలడు, తన తండ్రి రాజ్యంలో న్యాయాన్ని పునరుద్ధరించగలడు.

తన దోషంనుండి స్కార్ ఎంతకాలం అతన్ని పారద్రోలగలడో, అంతకాలం ఆ యువకుడైన సింబాను వాడు తన అదుపులో లేక స్వాధీనంలో ఉంచుకోగలడు. సింబా సత్యాన్ని ఎదుర్కొన్నప్పుడు మాత్రమే, తాను స్వతంత్రాన్ని కనుగొనగలడు (8:32).

గుప్తమైన పాపము యొక్క శక్తి అనేది ది స్కార్లెట్ లెటర్ అనే నవలలోని చర్చనీయాంశమైయుంది. అది హెస్టర్ పిరినే అనే ఒక స్త్రీ కథ. ఆమె తన భర్త లేని కాలంలో గర్భవతియౌతుంది. తన సమాజంలో బహిరంగంగా తీర్పు జరిగింది, అవమానకరమైన ఆ పనికి శిక్ష ప్రకటింపబడింది. ఆమె బిడ్డకు తండ్రి ఎవరో చూపించమని గ్రామ పెద్దలు హెస్టెరును ఎంత బలవంతపెట్టినా, ఆమె మొండిగా నిరాకరించింది. ఆమె శిక్ష – "A" అనే ఎర్రని అక్షరం ఆమె దుస్తుల ముందు పెట్టి బహిరంగంగా ఆమె వెలుపలికి వచ్చునప్పుడెల్లా దాన్ని ధరించుకోవాలి. మొట్ట మొదటిగా దాన్ని ఆమె ధరించినప్పుడు, ఎత్తుగా కట్టబడిన స్థలంలో గంటలు తరబడి పట్టణంలో నిలబెట్టారు. అది భయంకరమును బహు బాధాకరమైన తీర్పుగా మొదట్లో ఆమె భావించింది. అయితే ఆమె తన శిక్షను జీవితాంతం అమలు జరిపింది.

ఆ కథలో మరో పాత్ర రోజర్ (డిమ్మిస్‌డేల్) అనే ఒక సువార్తికుడు. ప్రతివారిచే ప్రేమించబడి గౌరవించబడే ఈ డిమ్మిస్‌డేల్ వేదనాకరమైన రహస్యాన్ని భరిస్తూ ఉంటాడు! అతడే హెస్టర్ బిడ్డకు తండ్రి. కథ కొనసాగుతుండగా, డిమ్మిస్‌డేల్ తన దోషాన్ని దాచుకోడానికి (తప్పించుకొనడానికి) అనేక విధాలుగా ప్రయత్నిస్తాడు. అతడు ఎడతెగక గ్రంథాలు చదువుతాడు, ప్రార్థిస్తాడు; మరియు కొన్ని సార్లయితే, తన పాపానికి పరిహారంగా అతడు తన్ను తాను కొరడాతో కొట్టుకుంటాడు. ఏదియేమైనా, వాటిలో ఏదియు అతనికి మేలు చేయలేకపోయింది. అతని ఆరోగ్యం నెమ్మదిగా పాడైపోవనారంభించింది. ఈ యిద్దరి కథలో, బాధపడ్డ స్త్రీగా ఉన్న హెస్టెర్ మెల్లగా బలం పుంజుకొంటూ బలమైనదౌతుంది. డిమ్మిస్‌డేల్ పట్టణంలో గౌరవించబడినవాడైనా, నెమ్మదిగా ఆత్మ సంబంధమైన క్యాన్సర్ అతని ఆత్మను నాశనం చేస్తున్నట్టు బలహీనుడైపోతాడు.

ఈ కథలో రోజర్ చిల్లింగ్‌వర్త్ అనేవానిది ఒక వింతైన పాత్ర. ఆ పట్టణపు ప్రజలకు ఈ సంగతి తెలియకపోయినా, అతడే హెస్టర్‌ను నిరాదరించిన భర్త. (అంటే అసలు భర్తయై ఉంటాడు) వ్యభిచారమందు హెస్టర్‌తో పాటు భాగస్థుడుగా శిక్షను భరించాలనేది తన కర్తవ్యం అనుకుంటాడు. సువార్తికుడు దోషియన్న విషయాన్ని ఇతడు (చిల్లింగ్‌వర్త్) గ్రహించిన తోడనే ఈ రోజర్ చిల్లింగ్‌వర్త్, రోజర్ డిమ్మిస్‌డేలును "స్నేహితుడుగా" చేసికొని, తన రహస్యాన్ని దాచి ఉంచడానికి అనేకమైన యుక్తి మార్గాల్లో అతన్ని ప్రోత్సహిస్తాడు.

చివరిగా, ఉత్కంఠను కలిగించే అంశంలో, డిమ్మిస్‌డేల్ తన జీవితమంతటిలో శక్తివంతమైన ప్రసంగాన్ని చేస్తాడు. సంఘమంతా సంఘ కూడిక భవనాన్ని విడిచి పట్టణపు వీధులలో గుండా నడిచిపోతూ, హెస్టెర్ నిలిచిన చోటుకు ఒకసారి వచ్చారు. సంవత్సరాల క్రిందట తన కొత్త దుస్తుల మీద "A" అనే అక్షరం కుట్టించుకుని ఆమె వేసికొని

నిలిచిన స్థలమది. ప్రతి ఒక్కరికి ఆశ్చర్యం కలిగించేలా డిమ్మిస్‌డేల్ ఆ స్థలంలో నిలుస్తాడు. క్షీణించిపోతున్న తన దేహంలో ఉన్న శక్తినంతటిని ఒక్కసారి తెచ్చుకొని, హెస్టెరును ఆమె బిడ్డను తన వద్దకు రమ్మని పిలుస్తాడు. అతని స్నేహితుడైన చిల్లింగ్‌వర్త్ అయితే, అతన్ని ఆపి, అతని రహస్యం యింకా దాచిపెట్టవచ్చునని అభయమిస్తాడు.

ఏదియెలాగున్నా, చిల్లింగ్‌వర్త్ అపవాది సేవకుడని డిమ్మిస్‌డేల్ యిప్పుడు గుర్తించి, అతన్ని ఒక ప్రక్కకు నెట్టివేస్తాడు. తాను, హెస్టెరు, వారి బిడ్డ ఆ పరంజీ మీదికి వెళ్లతారు. కడకు ఆ సువార్తికుడు తన పాపం విషయంలో యథార్థంగా ఉంటాడు. తాను ఓడిపోయినట్టు గుర్తించిన చిల్లింగ్‌వర్త్ డిమ్మిస్‌డేల్‌తో యిలా అంటాడు. తాను లోకమంతా చుట్టి వచ్చినా, ఒప్పుకోలు, మారుమనస్సు అనే పరంజీ మీదనే అతని ఆధీనంలోనుండి తప్పించుకొనే అవకాశం కలదంటాడు!

తన పాపం బహిర్గతమౌతుందేమోననే భయం యింతకాలంగా డిమ్మిస్‌డేల్‌ను బాధించింది. వింతగా, తన పాపాన్ని ఒప్పుకొనడంలోనే చివరిగా దానినుండి స్వతంత్రుడైనట్టు అతడు కనుగొన్నాడు.

పాపాన్ని ఎదుర్కొనడం మరియు పాపాన్ని కుంటుపడజేయు శక్తినుండి స్వాతంత్ర్యం పొందడమనే ఈ రెండింటి సంబంధాన్ని గూర్చి కీర్తన. 32 మాట్లాడుతుంది:

> నేను మౌనినై యుండగా దినమంతయు నేను చేసిన నా ఆర్తధ్వనివలన
> నా యెముకలు క్షీణించినవి.
> దివారాత్రులు నీ చెయ్యి నామీద బరువుగానుండెను;
> నా సారము వేసవికాలమున ఎండినట్టాయెను.
> నా దోషమును కప్పుకొనక,
> నీ యెదుట నా పాపము ఒప్పుకొంటిని;
> -యెహోవా సన్నిధిని నా అతిక్రమములు ఒప్పుకొందు ననుకొంటిని;
> నీవు నా పాపదోషమును పరిహరించియున్నావు (3-5 వచ.).

అతడు తనను ప్రేమిస్తున్నాడా అనే సంగతిని గూర్చి ప్రభువు పేతురును అడిగినప్పుడు, బహు వేదనకరమైన అంశాన్ని ఆయన అతని యెదుట పెట్టాడు. ఎందుకంటే ప్రభువు బంధింపబడక ముందు ఆయనను విడువనని గొప్పగా చెప్పుకున్నాడు, అయితే ఆయన బంధింపబడి తీర్పులో నిలబెట్టబడినప్పుడు, అతడు ఆయనను ఎరుగనని బొంకాడు. కఠినమైన ఈ అంశాన్ని తప్పిస్తే ఎంతో సులభంగా ఉండేదే గాని, అలా చేయడంవలన పేతురుకు ఏ మేలు కలిగేది కాదు. రహస్య పాపము నశింపజేస్తుంది. గనుక పేతురు చేసిన పాపాన్ని వెలుగులోనికి తెచ్చి, నేరుగా దాని విషయమై వ్యవహరించడం యుక్తమని ఈ పని చేశాడు.

## పునరుద్ధరణ (21:15-17)

పేతురు తన్ను ప్రేమిస్తున్నాడా అనే సంగతిని ప్రభువు ముమ్మారు అడిగాడు. తనయందలి విశ్వాసాన్ని పేతురు ఎన్ని సార్లయితే లేదన్నాడో, అన్నిసార్లు ఆయనయందలి

తన విశ్వాసాన్ని ఒప్పుకునే అవకాశాన్ని ప్రసాదించడానికే కాబోలు ప్రభువు అతన్ని అలా ప్రశ్నించింది. ప్రభువు ఆ ప్రశ్ననడిగిన రెండు సార్లు అగపే *(agape)* అనే గ్రీకు పదాన్ని, "దైవ ప్రేమ" అనే భావంతో ఉపయోగించాడు.[1] ఆ రెండు సార్లు కూడా పేతురు *phileo* అనే గ్రీకు పదంతోనే, అంటే "స్నేహితుని ప్రేమ" అనే భావంతోనే బదులు చెప్పాడు. చివరి ప్రశ్నలో ప్రభువు *phileo* అనే పదాన్నే వినియోగించాడు. మరియు పేతురు అదే పదంతో బదులిచ్చాడు. *agape* అనేది ప్రేమ యొక్క ఉన్నతమైన రూపమైయుంది. అయితే దేవుడు స్నేహితుని ప్రేమను సహితం అంగీకరిస్తాడన్నట్టు ప్రభువు సూచించాడు. ఆ సమయంలో పేతురు దేవుని పట్ల చూపగల ప్రేమ అంతమట్టుకే (పేతురుకు ఒకవేళ తనమీద ఎక్కువ నమ్మకం లేకుండ పోవచ్చు).

పాపంనుండి పునరుద్ధరింపబడే మార్గాన్ని అర్థం చేసికొనడంలో, ప్రభువైన యేసు అడిగిన ప్రశ్నను మనం గుర్తించాలి: "నీవు నన్ను ప్రేమిస్తున్నావా?" అని ఆయన అడుగుతాడు. మనం పాపంలో పడినప్పుడు, నిజమైన ప్రశ్ననుండి మనలను పక్కకులాగే అనేక యితర ప్రశ్నలు మనలను శోధింపవచ్చు. "అది నా తప్పా?"; "నా పాపం యితరుల పాపం కంటె అంత ఘోరమైనదా?"; "నా పాపం ఏ నాశనాన్ని కలిగించింది?"; "ఇతరులు తిరిగి నన్ను అంగీకరిస్తారా?"; "నన్ను యిలా చేయ నడిపించింది ఏది లేక ఎవరు?" అని మనం అడుగవచ్చు. ప్రశ్నలు యింకా అలా పోతూనే ఉంటాయి. పునరుద్ధరించబడే మార్గంలో పేతురును నడిపించడంలో, దేవుని వద్దకు అతని తిరిగి రప్పించడానికి "నీవు నన్ను ప్రేమిస్తున్నావా?" అని అడగడం ప్రధానమైన విషయంగా యేసు ప్రదర్శించాడు.

ప్రభువైన యేసు ప్రశ్నకు పేతురు బదులిచ్చిన ప్రతిసారి ఆయన అతనికి ఒక పనిని అప్పగించాడు: ఆయన "–నా గొఱ్ఱె పిల్లలను మేపుము" (21:15); "నా గొఱ్ఱెలను కాయుము" (21:16); "నా గొఱ్ఱెలను మేపుము" (21:17) అని అతనితో చెప్పాడు. పేతురును ఆయన క్షమించడం పాక్షికమైనది కాదు. పేతురు తన పాపాన్ని దాటి, యేసు క్రీస్తు యొక్క అపొస్తలుని స్థానాన్ని అతడు మరల తీసికొన్నాడు. నేడు మనం మన పాపాలనుండి తిరిగి వస్తే, ప్రభువైన యేసు మనలను కూడా ఆలాగే చేయాలను కుంటున్నాడు – తన రాజ్యంలో తిరిగి పని చేయడానికి తీసికొంటాడు!

## ఆహ్వానం (21:19)

పేతురును ప్రభువు పునరుద్ధరించిన చివరి స్థాయి, "నన్ను వెంబడించుము" అనే మాటలవలన వచ్చింది (21:19). తన భూ నివాస కాలపు పరిచర్యల ఆరంభంలో ప్రభువు ఆ మాటలు ఉపయోగించేవాడు. ఆయన తిరిగి అదే మాటలను ఆ ఉదయం సముద్ర తీరాన పేతురుతో ఆయన ఎదుర్కోలు ముగించడంతో ముగించాడు. తన శిష్యులందరిని ప్రభువు పిలిచే తీరు, "నన్ను వెంబడించుము!" అనేదానిలో మనం కూడా చేర్చబడ్డాం. "నన్ను వెంబడించుము" అనేది ఎదిగిన స్థాయిని సూచించదు, అది ఒక దిక్కువైపు చూపుతోంది. అది మన గతంతో గాని, లేక యితర శిష్యులతోగల పోలికతో

గాని ఎట్టి సంబంధం కలిగియుండదు. బలహీనత, యౌవనం, లేక పరిపక్వతలేని స్థితి అనేవాటిని మినహాయించదు. ఆ సమయంలో నీవు ఎక్కడ ఉన్నావో అక్కడనుండి ఆరంభించుమని ప్రతివానికి అది పిలుపునిస్తుంది. దానితో యేసును వెంబడించేలా పిలుపునిస్తుంది. పేతురు బహు దూరం వచ్చాడు, కాని గొప్ప దూరంలో అతడు పడిపోయాడు. ఈ దుఃఖాంతమందు, అతని విజయమందు ప్రభువు పేతురునకు పిలుపునిచ్చింది కూడా అదే: "నన్ను వెంబడించుము." ఈ నేరైన ఆజ్ఞయే నేడు ప్రభువు మనకు అందించే పిలుపు.

## ముగింపు

నీవు యింకను క్రైస్తవుడవు కాకుండినట్లయితే, మార్గము స్వల్పంగాను, తేటగాను ఉంది. బైబిలు పిలిచే "విశ్వాసము" లేక "నమ్మిక" అనే దానితో అది ఆరంభమౌతుంది.[2] విశ్వాసమంటే, ప్రభువైన యేసునందు మనం నమ్మిక ఉంచి, ఆయన చిత్తానికి లోబడవలసి యుంటుంది. విశ్వాసము మారుమనస్సులో తన్ను తాను బయలుపరచుకొంటుంది. (పాపమునుండి మరలి దేవునివైపు తిరగాలి)[3] అప్పుడు యేసు "ప్రభువని" ఒప్పుకోవాలి.[4] యేసును వెంబడించే జ్ఞాపక చిహ్నమైన తీర్మానం బాప్తిస్మమనే[5] రమ్యమైన కార్యంతో ముద్రించబడాలి.

మన హృదయంలో విశ్వాసాన్ని పుట్టించడానికి యోహాను ఈ సువార్తను వ్రాశాడు (20:30, 31). అది ఉద్దేశించిన ఫలితాన్ని నీ జీవితంలో కలిగించిందా? నీవు యేసునందు విశ్వాసముంచుతున్నావా? నీవు క్రైస్తవుడవయ్యావా? ఈ యాత్రవలన లేక ప్రయాణంవలన నీ విశ్వాసం బలపరచబడిందా? అయినట్లయితే, "ఆయన నామమందు మనకు జీవం ఉంది" గనుక ప్రభువు తప్పక నీ విషయమై ఆనందిస్తాడు.

---

సూచనలు

[1]మొదటి కొరింథీయులకు 13:4–7లో *agape* యొక్క శ్రేష్ఠమైన భావం వర్ణించబడింది. [2]యోహాను 3:16; మార్కు 16:16; అపొ. 16:31–34. [3]మత్తయి 4:17; లూకా 13:3; అపొ. 2:38; 17:30. [4]యోహాను 20:28; మత్తయి 10:32; రోమా 10:9, 10. [5]యోహాను 4:1; అపొ. 2:38; 8:38; రోమా 6:4–6; గలతీ. 3:27; కొలస్సీ. 2:12.